వేరుశనగ రైతు విలవిల

- ఖరీఫ్‌లో తగ్గిన దిగుబడులు
- మద్దతు ధర కన్నా తగ్గించి కొనుగోలు చేస్తున్న దళారులు
- పట్టించుకోని అధికారులు
- పెట్టుబడులకే సరిపోవడంతో రైతులు ఆవేదన
- కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి

ఉదయగిరి: కూటమి ప్రభుత్వంలో రైతులు ఆరుగాలం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. వ్యాపారులు, దళారులు కుమ్మక్కై ధరలను తగ్గించి రైతులను దోపిడీ చేస్తున్నారు. దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేస్తున్నామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేసి రైతులను ఆదుకునే దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో రైతులు నష్టాలను చవిచూస్తూ కాడెను వదిలేసే పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రస్తుతం మెట్టప్రాంతమైన ఉదయగిరిలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ కోతలు ప్రారంభమయ్యాయి. కూలీలు, ఎరువులు, పురుగు మందులు ధరలు పెరగడంతో గతేడాది కంటే ఈ ఏడాది సాగు ఖర్చులు పెరిగి పెట్టుబడులు అధికమయ్యాయి. తీరా పంట చేతికి వచ్చేసరికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కన్నా వ్యాపారులు తగ్గించి కొనుగోలు చేస్తుండడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు.

ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని వింజమూరు, కలిగిరి, జలదంకి, కొండాపురం మండలాల్లో వేసవిలో బోర్ల కింద 700 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. ఉదయగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో సుమారు వంద ఎకరాలకుపైగా సాగు చేశారు. ప్రస్తుతం రైతులు కోతలు చేపడుతున్నారు. ఈ ఏడాది వాతారణ పరిస్థితులు సహకరించక ఎకరాకు కేవలం 25 నుంచి 30 బస్తాలు (40కేజీలు) మాత్రమే దిగుబడులు వచ్చాయి.


సాగులో ఉన్న వేరుశనగ పంట

ప్రస్తుతం నూనె శాతాన్ని బట్టి బస్తాను రూ.1800 నుంచి రూ.2300 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు సగటున రూ.50వేలు వస్తే పెట్టుబడి ఖర్చులుపోగా శ్రమ ఫలితం కూడా దక్కడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వేరుశనగకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,250గా ప్రకటించింది. ఈ లెక్కన బస్తాను రూ.2,900 వరకు కొనుగోలు చేయాలి. కానీ వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారి ప్రభుత్వ మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని అన్నదాతలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


దిగుబడి తగ్గాయని చూపుతున్న రైతు

గిట్టుబాటు ధర కల్పించాలి



ఈ ఏడాది వేరుశనగ దిగుబడులు బాగా తగ్గాయి. దీనికి తోడు ధరలు కూడా ఆశాజనకంగా లేవు. ప్రస్తుతం 40కేజీల బస్తాను రూ.2వేలకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెట్టుబడులు కూడా రావడం లేదు. బస్తా రూ.3వేలకు కొనుగోలు చేస్తే రైతుకు కొంత ఊరటగా ఉంటుంది. కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకైనా కొనుగోలు చేస్తే ఫలితం ఉంటుంది. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి.

– సుబ్బారాయుడు, బండగానిపల్లి

అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన బైక్

- వ్యక్తికి గాయాలు



సోమశిల: బైక్ అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లడంతో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఈ ఘటన అనంతసాగరం మండల పరిధిలోని సోమశిల జలాశయం సమీపంలోని పరమానంద ఆశ్రమం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సోమశిల దక్షిణ కాలువ లీకేజీ నీటి ఉద్ధృతితో ఏడాది క్రితం పరమానంద ఆశ్రమం సమీపంలో కలువాయి–సోమశిల ప్రధాన రహదారిపై డెల్టాకు వెళ్లే కాలువ బ్రిడ్జి కోతకు గురై పూర్తిగా దెబ్బతింది. అప్పట్నుంచి బ్రిడ్జిని నిర్మించకుండా డైవర్షన్ రోడ్డు మీదుగా రాకపోకలను కొనసాగిస్తున్నారు. డైవర్షన్ రోడ్డు ప్రమాదభరితంగా ఉండడంతో తరచూ ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. ఆదివారం కూడా ఓ ద్విచక్ర వాహనం అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి గాయపడగా స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

గ్రామదేవతలకు పొంగళ్లు



ఉదయగిరి రూరల్: దుర్గంపల్లిలో గ్రామదేవతలు అంకాలమ్మ, పోలేరమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పొంగలి సామగ్రిని కొత్త బుట్టలో పెట్టుకుని డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టారు. అనంతరం అమ్మవార్లకు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం




సంగం: మండలంలోని వెంగారెడ్డిపాళెం గ్రామ సచివాలయంలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన నలుగురు సచివాలయ ఉద్యోగులను సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. సచివాలయ ఉద్యోగులను శాలువాలు, పూలమాలలు, శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు.

బీఎస్పీ సంగం మండల అధ్యక్షుడిగా బెల్లంకొండ



ఆత్మకూరు: బహుజన సమాజ్ పార్టీ సంగం మండలాధ్యక్షుడిగా బెల్లంకొండ వెంకటేష్ ఎంపికయ్యారు. ఆత్మకూరులోని బీఎస్పీ కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బుర్రా శేషాద్రి సంగం మండలాధ్యక్షుడిగా బెల్లంకొండను ప్రకటించి పార్టీ కండువా కప్పి అభినందించారు.

రేపటి నుంచి గంధ మహోత్సవం



ఉదయగిరి: స్థానిక పంచాయతీ బస్టాండ్ సమీపంలో ఉన్న హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ ఔలియా వారి దర్గాలో 220వ గంధ మహోత్సవాన్ని మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు సొందల్‌మాలి, బుధవారం గంధ మహోత్సవం, గురువారం జప్నే చిరాగి ఫాతెహా, శుక్రవారం తహలీల్ ఫతేహా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానంతో పాటు పాటకచ్చేరి, ఖవ్వాలి, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ

కావలి (జలదంకి): కావలి పట్టణం వెంగళరావునగర్‌లోని డీఆర్ విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో 60 మంది నిరుపేద వృద్ధులకు ఆదివారం నిత్యావసర సరుకులతో పాటు నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి మాట్లాడుతూ డీఆర్ గొప్ప మానవతావాది, విద్యాప్రదాత అన్నారు. నిరుపేదలకు సేవ చేయాలనే డీఆర్ ఆశయాలకు అనుగుణంగా ఆయన పేరుతో ప్రతి నెలా వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు తెలిపారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, జేబీ సెల్ఫ్ ఫైనాన్స్ డైరెక్టర్ మాల్యాద్రి, సభ్యులు రామకృష్ణ, సతీష్ సింగ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


సుబ్రహ్మణ్యానికి నగదును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతారామపురం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బార్బర్ షాపు నిర్వహించే ఎడమకంటి సుబ్రహ్మణ్యం ఇటీవల అనారోగానికి గురై కంటిచూపును కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఆయన వైద్యఖర్చుల కోసం మండల వైఎస్సార్‌సీపీ యువత ఆధ్వర్యంలో రూ.36వేలు నగదును సేకరించి ఆదివారం అందజేశారు. అందరికి సుపరిచితుడైన సుబ్రహ్మణ్యం త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య, మండల యూత్ అధ్యక్షుడు కనుమర్లపూడి పవన్‌కుమార్,ఆర్లేళ్ల కాశి,ఈగల రఘు, నాగమల్లి నారాయణ, విజయ్, అహ్మద్‌బాబు, మీనిగ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

దుత్తలూరు: ఆశా కార్యకర్తలకు పనిభద్రత కల్పించి కనీస గౌరవ వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆశా కార్యకర్తల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. దుత్తలూరు మండల ఆశాకార్యకర్తల సమావేశాన్ని నర్రవాడలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చిన తొమ్మిది ఒప్పందాలకు సంబంధించిన జీవోలను వెంటనే అమలు చేయాలన్నారు. ఆశా కార్యకర్త చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. ఉద్యోగ విరమణ ప్రయోజనాలు కలిప్పించడంతో పాటు గ్రూపు ఇన్సూరెన్స్, సెలవులు ఇవ్వాలన్నారు. ఆశా కార్యకర్తలతో టీబీ పరీక్షలు చేయించరాదన్నారు. ఆశాకార్యకర్తలపై పని భారం తగ్గించాలన్నారు. అనంతరం 11 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షురాలిగా రుక్మిణి, కార్యదర్శులుగా షకీల, అనంతలక్ష్మి, సహాయ కార్యదర్శిగా సరోజను ఎన్నుకున్నారు. సీపీఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి గుజ్జుల మల్లికార్జున, మండల కమిటీ కార్యదర్శి సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.


నూతన కమిటీతో దుగ్గిరాల అన్నపూర్ణమ్మ

తుమ్మాలమ్మకు పొంగళ్లు


పూలంగిసేవలో తుమ్మాలమ్మ

సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లిలో గ్రామదేవత తుమ్మాలమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పొంగలి సామగ్రిని కొత్త బుట్టలో ఉంచుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలతో విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే వెంగంపల్లి గ్రామ శివారులో ఉన్న పోలేరమ్మకు గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.


పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా ఆలయానికి వచ్చిన మహిళలు

డివైడర్‌ను ఢీకొన్న కార్లు

సంగం: మండలంలోని సిద్దీపురం–వెంగారెడ్డిపాళెం మధ్యన నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి వరుస రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. రేడియం స్టిక్కర్లు కనిపించక రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను సంగం నుంచి నెల్లూరు వైపు వెళ్లే రెండు కార్లు, నెల్లూరు నుంచి సంగం వైపు వస్తున్న ఓ కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదాల్లో ఏడుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సంగం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. నేషనల్ హైవే అధికారులు స్పందించి డివైడర్‌ను రాత్రి వేళల్లో గుర్తించేలా రేడియం స్టిక్కర్లను ఎత్తులో ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


కారు వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఎమ్మెల్యేకు సమస్యల ఏకరువు

ఉదయగిరి: ఉదయగిరిలో ఆదివారం పర్యటించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ప్రజలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని, అంతర్గత సీసీరోడ్లు గుంతలు పడడంతో అడుగు ముందుకు వేయాలంటే హడలిపోతున్నామని విన్నవించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా అవసరమైన పనులు చేపట్టకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

అపూర్వ సమ్మేళనం



సోమశిల: అనంతసాగరం మండలం రేవూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రవాస భారతీయుడు, పాఠశాల పూర్వ విద్యార్థి వల్లూరు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 1990 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన తెలుగు పండితుడు రమణారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని హెచ్‌ఎం అల్లంపాటి వెంకటేశ్వర్‌రెడ్డికి హామీ ఇచ్చారు. వ్యాయామ ఉపాధ్యాయిని సురా గౌరీరెడ్డి, ఏపీ ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, యూటీఎఫ్ నాయకుడు వద్దిబోయిన వెంకటేశ్వర్‌రెడ్డి, వంగవరపు హరిబాబు, కేత సుబ్బారెడ్డి, భక్తవత్సలరెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

కలిగిరి: బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంపై ఉదయగిరి నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని కలిగిరిలో సోమవారం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

జలదంకి: బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై మండల వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని జలదంకిలో సోమవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డి, యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



అనుమసముద్రంపేట: స్థానిక హబీబియా క్లినిక్‌లో డాక్టర్ ఖాజామియా ఆధ్వర్యంలో నెల్లూరు సుశీల నేత్రాలయ సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు విజయ్ 120 మందికి కంటి పరీక్షలు చేశారు. 40 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. టెక్నీషియన్లు ఫిరోజ్, షాకీరు, నరసింహ, మొయిద్, హబీబియా హాస్పిటల్‌కు చెందిన సయ్యద్ నాయబ్, ఎంబీటీ బాబు, నాగం పుష్ప, షఫీ పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఉపకార వేతనం



ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన నిరుపేద విద్యార్థి ఒంటేరు సాయిధనూష్ పదోతరగతిలో 565 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభకనబరచడంతో దుత్తలూరుకు చెందిన సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఉపకారవేతనాన్ని ప్రకటించింది. సాయిధనూష్‌కు ఉజ్వల భవిష్యత్ కోసం ఉన్నత చదువుల నిమిత్తం ఉపకారవేతనాన్ని అందించేందుకు దుత్తలూరుకు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీడ్స్ సంస్థ ముందుకొచ్చింది. ఈ సందర్భంగా సాయిధనూష్‌ను పలువురు అభినందించారు.

శివశంకర్ మాస్టర్‌కు కీర్తి పురస్కారం



మర్రిపాడు: మండలానికి చెందిన శివశంకర్ మాస్టర్ రాష్ట్ర ఎస్సీ కమిషనర్ చైర్మన్ కేఎస్ జవహర్ చేతుల మీదుగా కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. తాళపత్ర గ్రంథాలను తెలుగులోకి అనువదించినందుకుగానూ అమరావతిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కీర్తి పురస్కారాన్ని ప్రదానం చేశారని శివశంకర్ మాస్టర్ తెలిపారు.

మున్సిపల్ కార్మికుల ర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. గత నాలుగు రోజులుగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు మద్దతుగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేపడుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం పట్టణంలో మున్సిపల్ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. సీఐటీయూ, రైతు కూలీ సంఘం, ఎల్ఐసీ, అంగన్‌వాడీ, విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ల నాయకులు ర్యాలీలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సహృదయంతో పరిశీలించి పరిష్కరించాలని, గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు జీ శివప్రసాద్, ఎం డేవిడ్‌రాజు, ఏ నాగయ్య, ఎస్కే సందానీ, హజరత్తయ్య, రమేష్, రమణమ్మ, రాధమ్మ, పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మాతా పరమేశ్వరి జాతర ప్రారంభం

సంగం: స్థానిక చెక్‌పోస్ట్ సెంటర్ సమీపంలోని మాతాపరమేశ్వరి ఆలయంలో జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. తొలుత మహిళా భక్తులు పెన్నానది ఒడ్డున ఉన్న గంగమ్మ ఆలయం వద్ద గంగా స్నానాలు ఆచరించి అమ్మవారి బొమ్మను తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గంగమ్మ ఆలయం వద్ద నుంచి కలశ జలాలను తీసుకుని ఊరేగింపుగా మాతాపరమేశ్వరి ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం మైలుతుడుపు కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి కలశ జలాలతో అభిషేకం జరిపి విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


కలశ జలాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

ఆత్మకూరు: మండలంలోని వాసిలికి చెందిన చందన్ అనే యువకుడ్ని పోక్సో కేసులో శనివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్సై జిలానీ తెలిపారు. వాసిలికి చెందిన ఓ బాలికను అదే గ్రామానికి చెందిన చందన్ రోజూ తనను ప్రేమించాలంటూ వెంటపడుతూ వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో మూడ్రోజుల క్రితం ఆత్మకూరులోని పాఠశాలకు బాలిక వెళ్తుండగా నెల్లూరుపాళెం సెంటర్ వద్ద ఆగిఉన్న స్కూల్ బస్సులోకి ఎక్కి చెంపపై కొట్టి పారిపోయాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు చందన్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దుత్తలూరు: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలాభివృద్ధి, ప్రజాసమస్యలపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం


ఉత్తరకాలువ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

ఆత్మకూరురూరల్: రామస్వామిపల్లి వద్ద సోమశిల ఉత్తరకాలువ విస్తరణ పనులు చేపట్టి మూడేళ్లు పూర్తయినా కాలువ మధ్యలోని విద్యుత్ స్తంభాన్ని ఇప్పటికీ తొలగించలేదు. గ్రామ సమీపంలో ఉన్న ఈ స్తంభం విరిగిపడితే ప్రమాదం ముంచుకొస్తుందని పలుమార్లు గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేసినా విద్యుత్ శాఖ, సోమశిల అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం స్తంభాన్ని తీగలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. మరోవైపు ఉత్తరకాలువ మీదుగా రైతులు తమ పొలాల్లోకి ట్రాక్టర్లలో రాకపోకలు సాగిస్తుంటాయి. విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని కాలువ గట్టుపైకి మార్చి తీగల ఎత్తు పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కుమ్మదకు సన్మానం

ఉదయగిరి: వరికుంటపాడు మండలం జీ కొత్తపల్లికి చెందిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్రాధ్యక్షుడు కుమ్మద శ్రీనివాసరెడ్డి టీపీగూడూరు మండలంలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ గత నెల 30న ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో స్వగ్రామంలో కుమ్మద ఉద్యోగ విరమణ సభను మిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా శ్రీనివాసరెడ్డి అందించిన సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ తరువాత జనవిజ్ఞాన వేదిక రాష్ట్రాధ్యక్షుడిగా బాధ్యతలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం కుమ్మద దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో పాటు వివిధ పార్టీల నేతలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

